లక్ష్మణ్‌ను సత్కరించిన బస్తీవాసులు

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీ డా. కె.లక్ష్మణ్‌ను గాంధీనగర్ డివిజన్ వివేకానందనగర్ బస్తీవాసులు బుధవారం శాలువాతో సత్కరించారు. న్యూఢిల్లీలోని లక్ష్మణ్ అధికారిక నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి సత్కరించినట్లు వారు తెలిపారు. జనవరి 29న తమ ఇళ్లను జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ సిబ్బంది కూల్చివేసిన క్రమంలో వారికి న్యాయం చేసే విధంగా సహకరించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సూచించి కమిషన్ చైర్మన్‌తో అపాయింట్‌మెంట్ ఇప్పించినందుకు కృతజ్ఞతగా సత్కరించారు.


లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న వివేకానందనగర్‌వాసులు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీబంధు పథకం ప్రవేశపెట్టాలి

రాంనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీబంధు పథకం ప్రవేశపెట్టాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన బీసీ యువజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతీ బీసీ కుటుంబానికి 10 లక్షల రూపాయల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, 12 బీసీ కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు. మరో 30 బీసీ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ప్రతీ కార్పొరేషన్‌కు చైర్మన్, పాలకమండలిని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ పోస్టులను గతంలో రద్దు చేశారనీ, ఆ పోస్టులను పునరుద్ధరించి భర్తీ చేయాలనీ కోరారు. బీసీ 12 ఫెడరేషన్లకు ఎండీ పోస్టులు గత 11 సంవత్సరాలుగా భర్తీ చేయలేదని వెంటనే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం నేతలు జిల్లపల్లి అంజి, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, సుధాకర్, నందగోపాల్, రాజేందర్, రఘుపతి, నిఖిల్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నరేందర్‌యాదవ్


నరేందర్‌యాదవ్

చిక్కడపల్లి, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన నరేందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహించగా నరేందర్‌యాదవ్‌కు 968 ఓట్లు రాగా ఆయన నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఆన్‌లైన్‌లో బుధవారం సాయంత్రం వెలువడింది. గతంలో అధ్యక్షుడిగా ఉన్న సంగపాక వెంకట్ కన్నా నరేందర్‌యాదవ్‌కు 154 ఓట్లు అధికంగా వచ్చాయి. ఈ సందర్భంగా నరేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఆరు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం పని చేస్తానన్నారు.

'ఆర్టికల్ 335 నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి'

నల్లకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓయూలో ఆర్టికల్ 335 నోటిఫికేషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని జైభీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఇంటర్నల్ టెస్ట్ ఇంటర్ విద్యార్హతతో కొనసాగించాలన్నారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 335కి విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్, ప్రమోషన్ నోటిఫికేషన్ ఆర్డర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తీసుకురావడం తగదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లకు అడ్డుకట్టలో భాగమే ఈ నోటిఫికేషన్‌ను అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు వ్యతిరేకించాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటర్ విద్య తొలగించి డిగ్రీ అర్హత ఉండాలని సర్క్యులర్ తీసుకురావడం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లకు అడ్డుగా మారిందన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రమోషన్లకు ఇంటర్ విద్యార్హతను కొనసాగించాలన్నారు.

వృద్ధాశ్రమాలను బాగు చేసేందుకు కృషి

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు వృద్ధాశ్రమాలను బాగు చేసేందుకు నడుం బిగించినట్లు మార్కండేయ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా తక్కువ ఫీజు తీసుకోవడం లేదా ఉచితంగా వృద్ధాశ్రమాలు నిర్వహించే వారి ఆశ్రమాలకు తమవంతు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని లహరి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వారికి కావాల్సిన టైల్స్ అందజేశారు. శ్రీదేవి మాట్లాడుతూ తమకు చేతనైనంత సాయం అందిస్తే దీనస్థితిలో ఉన్న వృద్ధాశ్రమాలను బాగుచేస్తామని కోరారు.



లహరి వృద్ధాశ్రమానికి టైల్స్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

8న భార్యాబాధితుల సంఘం కోర్ కమిటీ ఏర్పాటు

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భార్యాబాధితుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కోర్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు బాలాజీరెడ్డి బుధవారం తెలిపారు. మహిళల కోసం తెచ్చిన చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాబాధితుల రక్షణ కోసం ఈ కోర్ కమిటీ పని చేస్తుందన్నారు. కాగా ఇదే సందర్భంగా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కూడా విడుదల చేస్తామని ఆయన వివరించారు.


గోపాల్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమితి ప్రతినిధులు

గోపాల్‌రావు సేవలు మరువలేనివి

బర్కత్‌పుర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన తొలి ఉద్యమంలో ఎస్.గోపాల్‌రావు నిర్వహించిన పాత్ర అమోఘమని, ఆయన పోరాటం నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. 1986లో నింబోలిఅడ్డ కార్పొరేటర్‌గా, హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలు మరువలేనివని వారన్నారు. ఇటీవల మృతి చెందిన ఎస్.గోపాల్‌రావు సంస్మరణ సభ బుధవారం హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.గోపాల్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి ఉపాధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ విగ్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి సాయిగిరిధర్, వర్కింగ్ ప్రధాన కార్యదర్శి బి.కృష్ణగౌడ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో హిందూ శ్మశాన వాటిక ట్రస్ట్ బోర్డు సభ్యులు సి.నందకిషోర్‌యాదవ్, నర్సోత్తమరెడ్డి, సత్యనారాయణ, నర్సింగ్ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకురాలి మృతి


కళావతి (ఫైల్)

ముషీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ గంగపుత్ర సంఘం సీనియర్ నాయకురాలు పూస కళావతి(65) బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, టీఆర్‌ఎస్ నాయకులు గోరక్‌నాథ్, గంగపుత్ర సంఘం నాయకులు కళావతి భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె అంత్యక్రియలు పార్శిగుట్టలోని గంగపుత్ర శ్మశానవాటికలో నిర్వహించారు.

పెచ్చులూడుతున్న మహాకాళి ఆలయం

పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు
ఆందోళన చెందుతున్న భక్తులు

ముషీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాల చరిత్ర గల మహంకాళి దేవాలయం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉంది. పెచ్చులు ఎప్పుడు ఎవరిపైన పడి గాయాలబారిన పడతారోనని భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. నెలరోజుల క్రితం ఆలయ పై కప్పు కూలినప్పటికి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడం పట్ల భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఊడుతున్న స్లాబ్ పెచ్చులు

భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోన్న మహాకాళి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఆలయం పై కప్పు శిథిలావస్థకు చేరుకొంది. అక్టోబరు 30వ తేదీన పెచ్చులు ఊడిపోయాయి. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సిబ్బంది దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆలయ ఈవో మహేందర్‌కుమార్, డీఈ, ఏఈ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టడం లేదు.


పెచ్చులూడిన మహాకాళి ఆలయ పై కప్పు

ఆందోళన చెందుతున్న భక్తులు

ఆలయ పై కప్పు పెచ్చులు ఊడిపోతుండడంతో ప్రతి రోజు వందల సంఖ్యలో హాజరయ్యే భక్తులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కనీసం కూలినచోట మరమ్మతు పనులు కూడా చేపట్టకపోవడం పట్ల భక్తులు అశుభంగా భావిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దఎత్తున హాజరయ్యే భక్తులు ఆలయ పరిస్థితిని చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే సమస్య



దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆలయం పై కప్పు కూలి నెలరోజులు కావస్తున్నా మరమ్మతు చేపట్టలేదు. భవిష్యత్‌లో పై కప్పు మరింత కూలే అవకాశం ఉంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలి. - డి.శివముదిరాజ్, స్థానికుడు

మరమ్మతులు నిర్వహించాలి



కూలిన ఆలయ పై కప్పునకు మరమ్మతు పనులు నిర్వహించాలి, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలి - శ్రీకాంత్‌యాదవ్, భక్తుడు

రాజేశ్వరికి ఓయూ డాక్టరేట్


రాజేశ్వరి

రాంనగర్: ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పి.రాజేశ్వరీకి ఓయూ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ కె.శ్యామల పర్యవేక్షణలో రాజేశ్వరీ చెస్ట్ సీటీ స్కాన్ మెడికల్ ఇమేజ్ సూపర్ రిజల్యూషన్ అండ్ క్లాసిఫికేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓయూ డాక్టరేట్ తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.



కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంకగాంధీని న్యూఢిల్లీ పార్లమెంట్ ఆవరణలో ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, ప్రతినిధులు లక్ష్మి, లలిత, సంగీత, సుజాత, స్వరూప, రాజేష్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

ప్రపంచ వ్యాప్తంగా కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకులు

రాంనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని డబ్ల్యూఎఫ్‌టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి జార్జియోస్ మావ్రికోస్ ఆరోపించారు. కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాతో సహ ఫ్రాన్స్, జపాన్, జర్మనీ, కోరియా వంటి సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచంలోని సంపదను దోచుకుంటున్నాయని ఆరోపించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్ర- నేటి పరిస్థితులు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. శ్రామికుల శ్రమశక్తిని కారుచౌకగా దోచుకోవడం వల్లనే ప్రపంచంలో సంక్షోభం పెరిగిందన్నారు. కార్మిక వర్గానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రపంచంలోని సమస్త శ్రామికులు ఐక్యపోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. భారత్ పాలక పార్టీలు కూడా కార్మికుల హక్కులను హరిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూఎఫ్‌టీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వదేశ్ దేవ్‌రాయ్, ఏఐబీఈఏ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.భాస్కర్, వెంకటేష్, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు యూసఫ్, బాల్‌రాజ్, నాయకురాలు విజయలక్ష్మి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డబ్ల్యూఎఫ్‌టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి జార్జియోస్

ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 6న ప్రజాప్రతినిధులతో ప్రభుత్వం జరిపే చర్చల్లో ఆటో సంఘాల ప్రతినిధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ఆటో, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ సభ్యులు రవాణాశాఖ జాయింట్ కమిషనర్ మమతాప్రభాకర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు అల్లూరి రవిశంకర్, నంద కిషోర్, ఎం.రవికుమార్, పల్లెర్ల రవి, ఎండి హబీబ్, ఎస్.కొమరయ్య మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా జేఏసీ పక్షాన అనేక నిరసన కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. దాంట్లో భాగంగా తమ డిమాండ్లను రవాణాశాఖ కమిషనర్‌కు ఐదుసార్లు రవాణామంత్రికి వినతిపత్రాలు సమర్పించామన్నారు. జాయింట్ కమిషనర్‌ను కలిసినవారిలో బి.పెంటయ్యగౌడ్, ఎ.రవి, శ్రీనివాస్‌ముదిరాజ్, వజ్రలింగం, వి.సమ్మయ్య యాదవ్ తదితరులున్నారు.


రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ సభ్యులు

టీడీపీ సభ్యత్వానికి మహిళల నుంచి స్పందన


టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న మహిళలు

రాంనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వానికి మహిళల నుంచి మంచి స్పందన వస్తుందని తెలుగు మహిళా నాయకురాలు జి.పద్మావతి అన్నారు. బుధవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. టీడీపీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు పి.సాయిబాబా, బాల్‌రాజ్‌గౌడ్, ఆజ్మీరారాజు నాయక్, యాదగిరి, సుభాష్, భిక్షపతి, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.


పూజలో ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, నంది కంటి గోపాలరావు తదితరులు

ఘనంగా మహాపడిపూజ

ముషీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని పోల్ బాల్ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం చిరంజీవిగౌడ్ అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ఎడ్ల హరిబాబు యాదవ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నాయకులు నంది కంటి గోపాలరావు, జేఏస్ పటేల్, అయ్యప్ప భక్తులు దేవరాజ్, రాజ్‌కుమార్, కోడూరు రాజా పాల్గొన్నారు.

ఘంటసాల గానం అద్వితీయం

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల గానం అద్వితీయమని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సత్య సంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగాన సభలో ఘంటసాల జయంతి ఉత్సవం జరిగింది. ఈసందర్భంగా తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డిని ప్రతిభా అవార్డుతోసన్మానించారు. ఈసందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ వందేళ్ల తర్వాత కూడా ఘంటసాల గానామృతాన్ని ఆతరం కూడా ఆస్వాదిస్తుందని, తెలుగుజాతి, భగవద్గీత ఉన్నంత వరకు ఘంటసాల చిరస్మరణీయంగా ఉంటారని పేర్కొన్నారు. సత్యసంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఓంకార్‌రాజు అధ్యక్షతన జరిగిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహనరావు, శైలజ, శ్రీమణి పాల్గొన్నారు.



నిర్మలా జగ్గారెడ్డిని సన్మానిస్తున్న అతిథులు


ప్రత్యేక పూజల్లో భక్తులు


వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న త్రినాథరావు

ఘంటసాల స్వరం గానరంగానికి వరం

చిక్కడపల్లి: ఘంటసాల స్వరం గానరంగానికి వరంలాంటిదని ఎస్‌బీఐ పూర్వ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు అన్నారు. సంగీత సాధనాలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రేక్షకులే గాయనీగాయకులుగా అనే శీర్షికతో ప్రేక్షకులతో ఘంటసాల గానం కార్యక్రమం నిర్వహించారు.

'ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు'

ముషీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు భోలక్‌పూర్‌లోని భవాని శంకర ఆలయంలో బుధవారం ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా రుద్రహోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఈవో జ్యోతి మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ కమీషనర్ ఆదేశాలకు సమస్త లోకకల్యాణార్థం పూజలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో సుదర్శనహోమం

చిక్కడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా చిక్కడపల్లిలోని సుప్రసిద్ధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సుదర్శన హోమం నిర్వహించారు. అదే విధంగా స్వామివారికి ప్రత్యేకంగా పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో రామాంజనేయులు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ నేతలు ముందుండాలి

ముషీరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముఠా గోపాల్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... ప్రజలకు సేవ చేసినప్పుడే ఆదరణ లభిస్తుందని అందుకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేసి పార్టీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, పార్టీ నాయకులు ప్రవీణ్, మున్వర్‌చాంద్, ఆరీఫ్, కృష్ణ, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గోపాల్‌ను సన్మానించిన శ్రీనివాస్‌రావు తదితరులు

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

చిక్కడపల్లి: దివ్యాంగుల అభివృద్ధికి, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దివ్యాంగులు సన్మానించారు.

వరదనీటి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలి

బర్కత్‌పుర, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో వరదనీటి కాలువ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం డివిజన్‌లోని వెంకటరమణ థియేటర్ వద్ద వరదనీటి కాలువ మ్యాన్‌హోల్ నిర్మించకపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని అక్కడికి వెళ్లి పనులను పరిశీలించారు. మ్యాన్‌హోల్ నిర్మించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు కృష్ణకుమార్, క్షీరసాగర్, సత్యనారాయణ, భీమ్‌రాజ్, సూరి, సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

నాయీబ్రాహ్మణులకు రిజర్వేషన్లు కల్పించాలి

కవాడిగూడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను ఏర్పాటు చేసి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, కార్పొరేట్ సంస్థలు రావడం వల్ల నాయీ బ్రాహ్మణుల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతోందని తెలంగాణ నాయీ బ్రాహ్మణ జీవో పోరాట సమితి అధ్యక్షుడు రమేష్‌నాయి డిమాండ్ చేశారు. తమ చేతివృత్తిని కార్పొరేట్ శక్తులు నిర్వహించడం వల్ల తమ కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడే దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ నాయీబ్రాహ్మణ జీవో పోరాట సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు రమేష్‌నాయి చేపట్టిన ధర్నాలో నాయీ బ్రాహ్మణులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయి మాట్లాడుతూ, తమ నాయీ బ్రాహ్మణ వృత్తిని ఇతర కులాలు, కార్పొరేట్ శక్తులు నిర్వహించకుండా పటిష్టమైనచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులు తమ వృత్తిని కొనసాగించకుండా ప్రభుత్వాలు ప్రత్యేకమైన జీవో తీసుకువచ్చి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన యాదగిరి, నరసింహనాయి, వెంకటేష్, యాదయ్యనాయి పాల్గొన్నారు.


ఇందిరాపార్కు వద్ద ధర్నాలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు